క్లుప్తంగా

సీఎంను కలసిన సాదత్



సీఎం జగన్‌కు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిమను అందజేస్తున్న సాదత్ అలీఖాన్

కదిరి అర్బన్: వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో ఈనెల 2వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కదిరి మైనార్టీ నాయకుడు సాదత్ అలీఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిమను ముఖ్యమంత్రికి బహూకరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లచెరువు: మండల కేంద్రంలోని రామస్వామి గుడి వీధిలో నివాసముండే మంగమ్మ (40) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బీఎస్.మక్బూల్ అహమ్మద్ స్పందించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయంగా రూ.10 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని స్థానిక నాయకుడు కల్లిపల్లి శ్రీనివాసులు చేతుల మీదుగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఘనంగా వీర చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతుకుంట కొత్తకాలనీలో ఆదివారం వీర చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు హోమాలు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేయించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దంపతులు అంగజాల నాగవేణి, అంగజాల రాజు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్, జయరాం, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని వసంతపురం గ్రామానికి చెందిన తిక్కయ్యస్వామి ఆలయ ధర్మకర్త బుచ్చిరెడ్డి గారి ఓబిరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బంధువులు, సన్నిహితులు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సుమారు 35 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తం బాటిళ్లను ఆర్డీటీ వారికి అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ప్రాదేశిక ఉపాధ్యక్షుడు - 2 (వైస్ ఎంపీపీ) ఎన్నిక సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రొసీడింగ్ అధికారి గోపాలరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- చిన్నారికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ప్రవీణ్

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతులనాగేపల్లి వద్ద ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రవీణ్ అనే చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కపట్నం మండలం సిద్ధిరాంపురం గ్రామానికి చెందిన చెన్ను, శ్యామల దంపతులు తమ కుమారుడు ప్రవీణ్‌తో కలిసి ధర్మవరం నుంచి బుక్కపట్నం గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పోతులనాగేపల్లి సమీపంలో చేరుకోగానే వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు స్వల్ప గాయాలు కాగా.. చిన్నారి ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నారిని చికిత్స నిమిత్తం ధర్మవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ప్రాణాంతకం.. గొంతువాపు

- వ్యాధిపై నిర్లక్ష్యం తగదు
- ముందు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న పశువైద్యులు



ధర్మవరం నియోజకవర్గంలో పశువుల సంఖ్య

మండలం	ఎద్దులు	ఆవులు	గేదెలు
ధర్మవరం	3,500	11,000	8,000
బత్తలపల్లి	2,500	6,500	4,500
తాడిమర్రి	2,000	5,500	6,000
ముదిగుబ్బ	3,500	10,500	9,000

బత్తలపల్లి: పాడి రైతులకు పశువులే జీవనాధారం. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ పాడిని అభివృద్ధి చేసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో గొంతువాపు, పచ్చిదొమ్మ లేదా గుదిపెట్టు వ్యాధులు పశువులకు సోకే అవకాశం ఉంది. ధర్మవరం నియోజకవర్గంలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో 62 వేల పశువులు ఉన్నాయి. వాటిలో ఆవులు, గేదెలు 53 వేలకు పైగా ఉన్నట్లు సమాచారం. అయితే పలు గ్రామాల్లోని రైతులు వ్యాధులు సోకిన వెంటనే పశువైద్యులను సంప్రదించడం లేదు. ఆ వ్యాధులపై వారు సంపూర్ణ అవగాహన కలిగి ఉంటే ఇళ్ల వద్దనే నిరోధించేందుకు వీలు కలుగుతుందని పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి చెబుతున్నారు. వర్షాకాంలో గేదెలకు సోకే ప్రాణాంతకమైన వ్యాధుల్లో గొంతువాపు ఒకటి. ఈ వ్యాధి పందుల్లో తరచుగా, గొర్రెలు, మేకల్లో చాలా అరుదుగా కనిపిస్తుంది. ఒంటెలు, గుర్రాలు, గాడిదెలు, ఏనుగుల్లో కూడా ఈ వ్యాధిని గుర్తించడం జరిగింది. ఈ వ్యాధి సంవత్సరం పొడవునా ఎప్పుడైనా వ్యాపించే అవకాశం ఉంది. కాని ఎక్కువగా వర్షాకాలంలో దీనిని గుర్తించవచ్చు. నదీ పరివాహక ప్రాంతాలు, డెల్టాలు, వరిసాగు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఉండే గేదెలకు వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఇది ఒక రకమైన సూక్ష్మజీవి (పాశ్చరెల్లా మాల్టోసిడా) ద్వారా ఇది పశువులకు వ్యాపిస్తుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా..

వ్యాధి సోకిన పశువుల నుంచి కారే సొంగ, ముక్కు నుంచి స్రవించే ద్రవాల ద్వారా వ్యాధి కారక బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. తరచుగా వ్యాధి సోకే ప్రాంతాల్లో నివసించే ఐదు శాతం పశువులు ఈ వ్యాధికి వాహకాలుగా ఉంటాయి. అలసిపోయిన, ఒత్తిడికి గురైన పశువులకు ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది. సాధారణంగా కలుషితమైన మేత, గాలి ద్వారా వ్యాధి కారకం పశువుల శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరంలోనికి ప్రవేశించిన క్రిమి త్వరగా విభజన చెంది ఎండోటాక్సిన్‌లు అనే విష పదార్థాలను విడుదల చేస్తుంది. ఇది రక్తంలోకి ప్రవేశించిన అనంతరం వ్యాధి లక్షణాలు బయటపడతాయి.

వ్యాధి లక్షణాలు..

చాలా సందర్భాల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండి వ్యాధి సోకిన 8 నుంచి 24 గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది. వ్యాధి ప్రారంభ దశలో పశువు నీరసంగా ఉంటుంది. తరువాత నడవలేక పోవడం, అధిక జ్వరం, నోటి నుంచి సొంగ కారడం, ముక్కు నుంచి చిక్కటి ద్రవం ప్రవించడం, కళ్ల ఎర్రబడి నీరు కారుతూ ఉండటం గమనించవచ్చు. తొలుత గొంతు భాగంలో వాపు ఉండి తరువాత వాపు చెంపలు, మెడ, ముందుకాళ్ల మధ్య భాగం, పొట్ట కింద భాగం వరకూ విస్తరిస్తుంది. పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. శ్వాస పీల్చేటప్పుడు గుర్‌గుర్ మని శబ్దం వస్తుంది. సాధారణంగా ఈ దశలో పశువు నాలుక బయటకు తీస్తూ శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. ఈ దశ తరువాత కొన్ని గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది. ఈ దశలో కోలుకోవడం చాలా అరుదు.

ప్రత్యేక శ్రద్ధ అవసరం



వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. వర్షాకాలానికి ముందు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి. క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలి. పశువైద్యుడి సలహా మేరకు సల్ఫామైడ్స్, టెట్రాసైక్లిన్స్, పెన్సులిన్, క్లోరామ్‌ఫినికాల్ వంటి యాంటిబయాటిక్ మందులు ముందుగా వాడితే ఫలితం ఉంటుంది. వ్యాధి ముదిరిన తరువాత చికిత్స పెద్దగా ఫలితం ఇవ్వదు. అన్ని పశువైద్యశాలలు, గ్రామీణ పశువైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉన్నాయి.

- గుర్నాథరెడ్డి, పశువైద్యాధికారి, బత్తలపల్లి

బాట మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ దేవత

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లి సమీపంలోని బాట మారెమ్మ స్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులు పూజలు చేసి, కానుకలు సమర్పించారు.

వైఎస్సార్‌టీఎఫ్‌లో చేరిక



ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీఎఫ్‌లో చేరుతున్న మహమూద్ అలీ

కదిరి అర్బన్: స్థానిక దత్తాఫంక్షన్ హాల్ సమీపంలో ఆదివారం టీచర్ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి సమక్షంలో ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమూద్ అలీ వైఎస్సార్‌టీఎఫ్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్సీ తీసుకుంటున్న చొరవకు ఆకర్షితుడై ఆ సంఘంలో చేరుతున్నట్లు తెలిపారు. రెండున్నర దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు జంషీద్, పుల్లారెడ్డి, శివయ్య, రమణారెడ్డి, ఇంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రశాంతి నిలయం: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డీఎస్ కేశవరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా బీఆర్‌పీ కేశప్ప, కోశాధికారిగా చెరువు భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా పల్లపు చెన్నక్రిష్ణ, రాంజీనాయక్ చోటుదక్కించుకున్న విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్ కేశవరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభ్యున్నతికి కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందన్నారు. నూతన కార్యవర్గంలో పుట్టపర్తి నియోజకవర్గానికి ప్రాధాన్యత దక్కడంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కృషి చేశారన్నారు. పార్టీ శ్రేణులు రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శ్రమించాలన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పుట్టపర్తిని అభివృద్ధి చేస్తున్న ఘనత ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, దంత వైద్యుడు డాక్టర్ నందన్‌రెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, సూర్యాగౌడ్, పవన్‌కుమార్, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మాదినేని చెన్నకృష్ణ, కవిత, సందీప్ చౌదరి, లింగప్ప, కురుబ కిష్టప్ప, శంకర్, గోపాల్‌రెడ్డి, ఫోటో సాయి, సత్యన్న, బెస్త రమేష్, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ వెరిఫికేషన్



ఎన్పీకుంట: డబుల్ ఎంట్రీ అయిన ఓట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాఘవేంద్ర

ఎన్పీకుంట: మండలంలో ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను బీఎల్‌ఓలు పారదర్శకంగా నిర్వహించారని కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర అన్నారు. ఆదివారం బీఎల్‌ఓలు నిర్వహించిన ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 2022 జూన్ నుంచి ఇప్పటి వరకు ఫారం నంబర్-7కు సంబంధించి తొలగించిన ఓట్లను బీఎల్‌ఓలు రీవెరిఫికేషన్ చేశారన్నారు. ఇందులో మండల వ్యాప్తంగా 443 డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించారని తెలిపారు. డబల్ ఎంట్రీలైన ఓటర్లతో చర్చించి వారికి అవసరమున్న చోట ఓటు కల్పించి, డబల్ ఎంట్రీని తొలగిస్తామని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో డబుల్ ఎంట్రీ అయిన ఓటర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ ఎలక్షన్ డీటీ ముకుంద, బీఎల్‌ఓలు రూప, రమణ పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని ముద్దన్నగారిపల్లి, కటారుపల్లి, తుమ్మలబైలు గ్రామాల్లో ఆదివారం కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా పోలింగ్‌కేంద్రాలు 155 (ముద్దన్నగారిపల్లి), 156 (కటారుపల్లి), 158(తుమ్మలబైలు) గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఓటర్లతో మాట్లాడారు. ఓటరు జాబితాలను పునఃపరిశీలించారు. ఓటర్ల తొలగింపు, ఒకే పేరుతో రెండు చోట్ల ఓట్లు (డబుల్ ఎంట్రీ), మృతి చెందిన వారి ఓట్లు తొలగించారా లేదా అని ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్ని ఓట్లు ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాబితాలను పునఃపరిశీలించి సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ హమీద్ బాషా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ముకుంద, బీఎల్వోలు ఉన్నారు.

ఓటరు నమోదుకు చర్యలు తీసుకోండి



తొలగించిన ఓట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

అమడగూరు: ఓడీచెరువు మండలంలో ఇటీవల నిర్వహించిన ఓటరు జాబితా సర్వేలో తొలగించిన ఓట్లను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ భాగ్యరేఖ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. సర్వేలో తొలగించిన 49 ఓట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తొలగించిన ఓటర్లను కలసి మాట్లాడారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇంకా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికి పూర్తిగా 18 ఏళ్లు నిండే వారిని కొత్త ఓటరుగా నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత అంబేడ్కర్ లయన్స్



విజేతగా నిలిచిన అంబేద్కర్ లయన్స్ జట్టు

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బత్తల హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ మండల విజేతగా అంబేద్కర్ లయన్స్ జట్టు నిలిచింది. ఆదివారం కుమ్మరవాండ్లపల్లిలోని క్రీడా మైదానంలో కట్లతండా జట్టు, అంబేద్కర్ జట్లు తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచిన కట్లతండా టీం ఫీల్డింగ్ ఎంచుకుంది. అంబేద్కర్ లయన్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 116 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కట్లతండా జట్టు 66 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా బత్తల రామ్‌ప్రసాద్ హాజరయ్యారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో అంబేద్కర్ లయన్స్ జట్టు పాల్గొంటుంది.

సేవాభావంతో ముందుకు సాగాలి



పోలీసులకు యూనిఫాం అందజేస్తున్న డీఎస్పీ శ్రీలత

తనకల్లు: ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు సాగాలి అని కదిరి డీఎస్పీ శ్రీలత అన్నారు. కనసానివారిపల్లి వద్ద వెలసిన ధనకొండ గంగమ్మ దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బందోబస్తు నిర్వహించిన పోలీసులకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశ్రామిక వేత్త ఎంజీ రెడ్డి మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సొంత ఖర్చులతో గంగమ్మ తల్లి ఆలయాన్ని పునః నిర్మించడం హర్షించదగిన విషయమని కొనియాడారు. అనంతరం పలువురు కానిస్టేబుళ్లకు యూనిఫాం అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కదిరి రూరల్ సీఐ శంకర్‌నాయక్, ఎస్‌ఐ రాంభూపాల్, ఏఎస్‌ఐ నరసింహులు, వినోద్‌కుమార్, సమరసింహా రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీయూలో చేరిన ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ ఏపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని జానకీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లాలో సీనియర్, జూనియర్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. అనంతరం కార్యదర్శి కోనంకి చంద్రశేఖర ఆధ్వర్యంలో రవిచంద్ర, సంపత్‌కుమార్, విజయ్‌కుమార్, వెంగయనాయుడు, సుధాకర్, క్రిష్టప్ప, రామంజనేయులు, రామచంద్ర, రాజు, శంకర్‌నారాయణ, వర్మ, నరసింహమూర్తి, హరిప్రసాద్ తదితరులు ఎస్టీయూ ఏపీలో చేరారు. ఈ సందర్భంగా ఎస్టీయూ ఏపీ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతరం పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. 117 జీఓను రద్దు చేసి, బోధనకు ఆటంకమైన యాప్‌లను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర అదనపు కార్యదర్శి చంద్రశేఖర్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు సూర్యుడు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

తలుపుల: మండలంలోని వేపమానిపేట పంచాయతీలోని బోయపల్లిలో ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం వేదపారాయణం, కలశపూజ, మహాస్థాపనం, గణపతి నవగ్రహ హోమం, సాయంత్రం సాయం దీక్షా హోమం, వివిధ దేవతల మూలమంత్ర హోమం, స్వామికి ధనాదివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. రాత్రికి కోలాటం నిర్వహించారు. ఆవుల వంశస్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకుడు ఆవుల వివేకానందరెడ్డి తెలిపారు.

టూటౌన్ సీఐ బదిలీ

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణం టూటౌన్ సీఐ పి.రాజ కడప తాలూకాకు బదిలీ అయ్యారు. పట్టణంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఈయన సీఐగా విధులు నిర్వర్తించారు. సీఐ రాజ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేశారని పలువురు కొనియాడారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేసిన సింగపూర్ భక్తులు

పుట్టపర్తి అర్బన్: సింగపూర్‌కు చెందిన సత్యసాయి భక్తుల సహకారంతో శ్రీవాణి బ్లోసమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పుట్టపర్తిలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్కేల్స్, దుప్పటలు, తినుబండారాలు అందజేశారు. వసతి గృహంలో ఉన్న 126 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. బాగా చదువుకోవాలని సూచించారు. వసతి గృహంలో క్రమశిక్షణతో ఉండాలన్నారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో సింగపూర్ దేశస్తులు లలితా జవహరిలాల్, హనుమాన్, యేచూరి శ్రీవాణి, శ్రీనివాస్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడికి గాయాలు

పెనుకొండ రూరల్: విద్యుత్‌షాక్‌కు గురై యువకుడు గాయపడిన ఘటన మడకశిరరోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. రొద్దం గ్రామానికి చెందిన సోమశేఖర్ ఇనుప కడ్డీలు భుజంపై తీసుకెళ్తుండగా, కర్ణాటక బ్యాంకు ఎదురుగా ఉన్న ఫారంకి కడ్డీలు తగిలి, విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతన్ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ విజేత తనకల్లు



విజయ సంకేతం చూపుతున్న క్రీడాకారులు

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ విజేతగా తనకల్లు-1 జట్టు విజయం సాధించింది. కదిరి డివిజన్‌లోని ఆరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులతో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం ఎన్.పీ.కుంట-1, తనకల్లు-1 జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత 16 ఓవర్లలో ఎన్.పీ.కుంట-1 జట్టు 102 పరుగులు చేసింది. తనకల్లు-1 జట్టు 15.5 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 103 పరుగులు సాధించి విజేతగా నిలిచింది.

139 పింఛన్ల మంజూరు

కొత్తచెరువు: మండల వ్యాప్తంగా 139 నూతన పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సిద్ధారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర నూతన పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్

పెనుకొండ రూరల్: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నగర పంచాయితీ పరిధిలోని కోనాపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సురేష్ ఆదివారం రాత్రి కుటంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

సీపీఎం నాయకుడి మృతి



రామాంజినేయులు (ఫైల్)

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు (70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు, పలువురు సంతాపం తెలిపారు. గత 20 ఏళ్లుగా సీపీఎం పార్టీలో ఉంటూ సేవలందించారని గుర్తు చేసుకున్నారు.

నేడు స్పందన

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా హాజరై, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరుకావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

తలుపుల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ రఫీనాయక్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి పింఛన్ లబ్ధిదారులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు.